

అదనపు కట్నం కోసం వేధింపులు..

- కుమారుడికి విషగుళికలు తినిపించి తానూ తిని మహిళ ఆత్మహత్య
- కూతురు, మనవడి మరణాన్ని జీర్ణించుకోలేక ఆమె తల్లి బలవన్మరణం
- ఒకే కుటుంబంలో ముగ్గురి మృతి

7లో..

ఎన్నికల వేళ రైతు రాగం

- రైతు దీక్ష చేపట్టిన ఎంపీ సంజయ్
- 5న మాజీ సీఎం కేసీఆర్ పొలంబాట
- రైతు బంధు, రైతు బీమా, పంట పరిహారంపై చర్చ
- అన్నదాతల ఓట్లపైనే అందరి దృష్టి



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో రాజకీయపక్షాలు రైతు రాగం వినిపిస్తున్నాయి. ఎండలు మండిపోతూ జలవనరులన్నీ అడుగంటుతున్నాయి. మెట్టప్రాంతాల్లో పంటలకు సాగునీటి కొరత తీవ్రంగా ఉంది. ఐదెకరాల రైతులకు కూడా రైతుబంధు అందకపోవడం, రెండు లక్షల రుణ మాఫీ, అకాలవర్షాలతో నష్టపోయిన పంటకు ఇంకా పరిహారం రాకపోవడాన్ని రాజకీయపక్షాలు తమ అస్త్రాలుగా అందిపుచ్చుకొని అధికార పక్షంపై సంధిస్తున్నాయి. ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు అంటూ బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ పొలంబాట పట్టారు. పంట పొలాలకు సాగునీరు అందకుండా పోవడానికి ప్రణాళికాబద్ధంగా వ్యవహరించని ప్రభుత్వ తీరే కారణమని బీజేపీ ఆరోపిస్తున్నది. ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ రైతుల సమస్యలపై రైతు దీక్ష చేపట్టగా కేసీఆర్ ఈనెల 5న జిల్లాలో పొలం బాట కార్యక్రమానికి హాజరుకానున్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ కార్యక్రమాలతో రైతుల సమస్యలు తెరపైకి వచ్చి చర్చనీయాంశాలుగా మారుతున్నాయి. జిల్లాలో నెలకొన్న రైతుల సమస్యలపై కలెక్టరేట్ ఎదుట బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ రైతు దీక్ష చేపట్టాలని నిర్ణయించగా ఎన్నికల కోడ్ కారణంగా అందుకు నిరాకరించారు. దీంతో ఆయన తన పార్లమెంట్ నియోజకవర్గ కార్యాలయంలో రైతు దీక్ష చేపట్టగా జిల్లా నుంచే కాకుండా ఉమ్మడి జిల్లా పరిధి నుంచి పలువురు రైతులు, రైతు నాయకులు తరలివచ్చి సంఘీభావం తెలిపారు. అకాలవర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు 25వేల రూపాయల చొప్పున పరిహారం ఇవ్వాలని, రైతుబంధు సహాయం ఇప్పటికీ రైతుల ఖాతాల్లో జమకాలేదని, రెండు లక్షల రూపాయల రుణ మాఫీని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పి అమలునుంచి తప్పించుకుంటున్నదని బండి సంజయ్‌కుమార్ ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించారు. కేంద్ర ప్రభుత్వం ఎరువులపై పెద్ద ఎత్తున సబ్సిడీ ఇవ్వడమే కాకుండా 6,350 కోట్లు వెచ్చించి రామగుండం ఎరువుల కర్మాగారాన్ని తిరిగి తెరిపించిందని సంజయ్ రైతుల దృష్టిని ఆకర్షించడానికి ప్రయత్నించారు. రైతులు ఏమి కోరుకుంటున్నారో చెబితే రానున్న లోక్‌సభ ఎన్నికల మెనిఫెస్టోలో ఆ అంశాలను పొందుపరుస్తామని ఆయన రైతులకు హామీ ఇచ్చారు.

విమర్శలను తిప్పికొడుతున్న కాంగ్రెస్

అధికారపక్షమైన కాంగ్రెస్ వంద రోజుల్లో తాము చేసిన పనులను వివరిస్తూ ప్రస్తుత కరువు పరిస్థితికి బీఆర్‌ఎస్సే కారణమని ఎదురుదాడి ప్రారంభించింది. ఐదెకరాల వరకు రైతుబంధు నిధులు విడుదల చేశామని, రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని చెబుతూ మంత్రులు విపక్షాల ఆరోపణలను ఖండిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో రైతుల మద్దతు కూడగట్టుకోవడానికి అన్ని రాజకీయపక్షాలు చేస్తున్న ప్రయత్నాలను గమనిస్తున్న రైతులు ఎవరి పక్షం ఉంటారో అన్నది ఇప్పుడు అంతటా చర్చనీయాంశంగా మారింది.

రైతులను పరామర్శించనున్న మాజీ సీఎం కేసీఆర్

బీజేపీ ఇలా రైతురాగాన్ని ఆలాపిస్తుంటే అధికారం కోల్పోయి విపక్షంలో నిలిచిన బీఆర్‌ఎస్ కూడా అదే రాగాన్ని అందుకుంటున్నది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పొలంబాట కార్యక్రమానికి సూర్యాపేట, జనగాం, పర్యటనతో శ్రీకారం చుట్టి రెండో పర్యటనగా కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఈనెల 5న పర్యటించాలని నిర్ణయించుకున్నారు. జిల్లాలోని చర్లబూత్కూర్, గంగాధర, రామడుగు ప్రాంతాల్లో సాగునీరందక ఎండిన పంట పొలాలను సందర్శించాలని, వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాల్లోనూ సాగునీటి కరువును పరిశీలించి రైతులతో మాట్లాడాలని నిర్ణయించుకున్నారు. ఆ పార్టీ మాజీ మంత్రి, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, పెద్దపల్లిలో 36 గంటల రైతు నిరసన దీక్షను చేపట్టారు. ఈ కరువు కాలం కారణంగా వచ్చింది కాదని కాంగ్రెస్ పార్టీ తెచ్చిన కరువని అధికారపార్టీపై బీఆర్‌ఎస్ ఎదురుదాడి ప్రారంభించింది. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను ప్రతిష్టను తగ్గించడానికి కాళేశ్వరం ప్రాజెక్టులో రెండు పిల్లర్లు కుంగిన అంశాన్ని వాడుకుంటున్నదని, వాటికి మరమ్మతులు చేయించకుండా కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని దిగువకు వదిలి ఈ సీజన్‌లో పంట పొలాలకు నీరందకుండా చేశారని విమర్శించారు. రైతుబంధు కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం సిద్ధంగా ఉంచిన 7,500 కోట్లను రైతుల ఖాతాల్లోకి జమచేయకుండా కాంట్రాక్టర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిందని, పంటలు ఎండి పోయి రైతులు ఇబ్బందుల్లో ఉంటే మంత్రులు, ముఖ్యమంత్రి ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని బీఆర్‌ఎస్ ఆరోపిస్తున్నది. రైతుల సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తూ రాజకీయాలకే ప్రాధాన్యతనిస్తున్న కాంగ్రెస్‌ను ఎండగట్టేందుకు కేసీఆర్ కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల పర్యటనను తలపెట్టారు. బీఆర్‌ఎస్ ఇప్పటికే రైతుల సమస్యలపై ఆందోళనలు చేపడుతూ వారి మద్దతును కూడగట్టుకునే ప్రయత్నం చేస్తున్నది.

పకడ్బందీగా తాగునీటి సరఫరా చేయాలి

- అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 2: గ్రామాల్లో తాగునీటి సరఫరాను పకడ్బందీగా చేయాలని, ఎలాంటి అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ సమావేశ మంది రంలో ఎంపీవో, ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ ఏఈలు, డీఈలతో గ్రామాల్లో తాగునీటి సరఫరా, నీటి ఎద్దడి నివారణ చర్యలపై సమీక్ష నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ జిల్లాలో తాగునీటి సమస్య ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల న్నారు. అవసరమైన చోట మంచి నీటి బావులు తవ్వించాలని, వారం రోజుల్లో పనులు చేపట్టాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో బోర్లు వేయించాలని, పైపులైన్ల మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో ప్రతి ఇంటికి నల్లాల ద్వారా తాగునీటి సరఫరా సక్రమంగా జరుగు తుందా లేదా అని క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు. దీనిపై నివేదికను సిద్ధం చేసి అందించాలని అన్నారు. పైపులైన్ల లీకే జీలతో మురుగునీరు తాగునీటి కలిస్తే వ్యాధులు ప్రబలే అవకాశ ముంటుందని, లీకేజీలను గుర్తించి వెంటవెంటనే మరమ్మతులు చేయాలని సూచిం చారు. ఓహెచ్ ఎస్ఆర్ ట్యాంకులను ప్రతి పది రోజులకొకసారి శుభ్రం చేయడంతోపాటు క్లోరినేషన్ సక్రమంగా జరిగేలా చూడాలని అన్నారు. అధికా రులంతా ప్రతి రోజు తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టిపెట్టాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహించ వద్దని, ఏదైనా సమస్య వస్తే త్వరగా వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ఈసమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి రవీందర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ అంజన్ రావు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా సర్వాయి పాపన్న గుట్టలు



సర్వాయి పాపన్న విగ్రహానికి పూల మాల వేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సైదాపూర్, ఏప్రిల్ 2: సర్దార్ సర్వాయి పాపన్న ఆనవాళ్లున్న పాపన్న గుట్టలను పర్యాటక కేంద్రగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం సర్వాయి పాపన్న వర్దంతి సందర్భంగా మంత్రి సర్వాయిపేట శివారులో గల కొమ్ముగట్టు వద్దకు వెళ్లి పాపన్న విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజన వీరుడు సర్వాయి పాపన్న స్ఫూర్తితో ముందుకు సాగుతున్నానని, ప్రజల అభివృద్దే లక్ష్యంగా పని చేస్తానన్నారు. ఎన్నికలకు ముందు టీపీసీసీ అధ్యక్ష హోదాలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాపన్న గుట్టలను సందర్శించి, ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారన్నారు. పాపన్న గుట్టలను పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయాలని సర్వాయిపేట వేదిక నుంచి ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. తాను ముఖ్యమంతితో మాట్లాడి సర్వాయి పాపన్న చరిత్రను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. పాపన్న గుట్టలను క్వారీలకు అనుమతి ఇవ్వకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం సైదాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థు లతో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. మధ్యాహ్న భోజనం నాణ్యత ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని గొడిశాల గ్రామానికి వెళ్లి భారతదేశ సరిహద్దులో మృతి చెందిన ఆర్మీ జవాన్ నెల్లి రామకృష్ణ ఇంటికి వెళ్లి ఆయన చిత్ర పటానికి పూలమా లలు వేసి నివాళులర్పించారు. అనం తరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్ర మంలో గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపెల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొంత సుధాకర్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుండారపు శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మిట్టపెల్లి కిష్టయ్య, గౌడ సంఘం నాయకులు మాచర్ల ఆంజనేయులు, సమ్మెట సతీష్, మాచర్ల రమేష్, దేశిని కోటి, బుర్ర ముత్తయ్య,కాంగ్రెస్‌నాయకులురాజు, తిరుపతి పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీల అమలు చేతకాని కాంగ్రెస్

- అన్నదాతలకు భరోసా ఇచ్చేందుకే రైతు దీక్ష
- ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మోసపూరిత హామిలిచ్చి ఆరు గ్యారెంటీలు అమలు చేయడం చేతకాక కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. మంగళవారం ఆయన నగరంలోని ఎంపీ కార్యాలయంలో రైతు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రైతుల పంటలు ఎండిపోయాయని, ఫసల్ బీమా అమలు చేయకపోవడంతో పంటల బీమా రాక రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. రైతులు కాంగ్రెస్‌ను నమ్మి ఓట్లేస్తే నట్టేట ముంచుతారా అని ప్రశ్నించారు. రైతు భరోసా కింద ఎకరాకు 15 వేల రూపాయలు ఎందుకు ఇవ్వడం లేదన్నారు. తాలు, తప్ప, తరుగు లేకుండా ధాన్యాన్ని కొనాలని డిమాండ్ చేశారు. రైతులకు రుణమాఫీ రెండు లక్షలు ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయడం చేతకాక పోతే కేంద్రానికి లేఖ రాయాలని, తాము కేంద్రాన్ని ఒప్పించి నిధులు తీసుకువస్తామన్నారు. రైతు భరోసా 15 వేలు, 2 లక్షల



కరీంనగర్ లో నిర్వహించిన రైతు దీక్షలో బండి సంజయ్, తదితరులు

రుణమాఫీ, వరికి క్వింటాల్‌కు 500 బోనస్ ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. కేంద్రం వరికి ఇస్తున్న మద్ధతు ధరకు అదనంగా 500 బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి 25 వేల రూపాయల నష్టపరిహారం అందించాలన్నారు. రైతు భరోసా 15 వేలు, కౌలు రైతులకు 15వేలు, కూలీలకు 12 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ గడీల పాలనను బద్దలుకొట్టిన ఘనత బీజేపీదే అన్నారు. రాష్ట్రంలో 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కుంభకోణం జరిగిందని, రాష్ట్రంలో వరి కొనుగోలు మాఫియా కొనసాగుతుందని, సీబీఐ విచారణ జరగకుండా ప్రభుత్వం నిషేధించిందన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయకపోతే కాంగ్రెస్‌లో మిగిలేది ఆరుగురు మాత్రమే అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల కోసం గేట్లు తెరవడం కాకుండా సాగునీటి కోసం గేట్లు తెరవాలన్నారు. రైతుల పక్షాన పోరాడి వంద కేసులు ఎదుర్కొంటున్నామని ఆనాడు రాళ్లదాడి చేసిన విషయం కాంగ్రెస్ నాయకులకు కనిపించలేదా అని ప్రశ్నించారు. అన్ని కేంద్రమే ఇవ్వాలనుకుంటే ఇక్కడ కాంగ్రెస్ సర్కార్ ఎందుకని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని దించాలనే ఆలోచన బీజేపీకి లేదన్నారు. కేసీఆర్ పరిస్థితే కాంగ్రెస్‌కు పడుతుందన్నారు. ఆరు గ్యారెంటీలను 600 కోట్లతో అమలు చేసినట్లుగా ప్రచారం చేసుకుంటున్నారన్నారు. నగరాల్లో తాగునీటి ఇబ్బందులు ప్రారంభమవుతున్నాయన్నారు. కేసీ ఆర్ ఫాం హౌజ్ నుంచి రాజకీయాలు చేస్తే, కాంగ్రెస్ నేతలు హామిల పేరుతో రాజకీయం చేస్తున్నారన్నారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓట్లేస్తే ఎరువులపై సబ్సిడీని ఎత్తి వేస్తారన్నారు. తాము శ్రీరాముడి ఫొటోతో ఓట్లడుగుతున్నామని, వాళ్లకు దమ్ముంటే బాబర్ ఫోటోతో ప్రచారం చేసు కోవాలని సవాల్ విసిరారు. కార్యక్ర మం లో ఎస్సీ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి ఎస్‌కు మార్, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధిరాణి రుద్రమదేవి పాల్గొన్నారు.

రైతుల సంఘీభావం

బీజేపీ జాతీయప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు చేపట్టిన రైతు దీక్షకు పార్లమెంట్ నియోజక వర్గంతోపాటు, పొరుగు జిల్లాల నుంచి రైతులు తరలి వచ్చి సంఘీభావం ప్రకటించారు. కలెక్టరేట్‌వద్ద దీక్షకు అనుమతి రాకపోవడంతో ఉదయం పది గంటలకు రైతు దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కు రైతు సంఘం నాయకులు చంద్రారెడ్డి, కరుణాకర్, కొమురయ్యతోపాటు పలువురు రైతులు సంఘీభావం ప్రకటించారు. ఉదయం నుంచి దీక్షా విరమణ వరకు రైతులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఎండిన పంటలు, నాగలి నమూనాలు, రాలిన మామిడి కాయలను తీసుకు వచ్చి దీక్షకు మద్ధతు ప్రకటించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటలవరకు కొనసాగిన దీక్షను రైతులు బండిసంజయ్‌కు నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు.



రేపు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ



సుభాష్‌నగర్, ఏప్రిల్ 2: కొత్తపల్లిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో కాంట్రాక్టు పద్ధతిపై ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీ కోసం ఈనెల 4న వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు కాలేజీ వెబ్‌సైట్‌లో పొందుపరిచిన అప్లికేషన్ ఫారంతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలను ఈనెల 3న కాలేజీలో సమర్పించాలని సూచించారు. ఈనెల 4న ఒరిజినల్ సర్టిఫికెట్లతో వాక్ ఇన్ ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. వివరాలకు కాలేజీ వెబ్ సైట్ www.gncjonekh.vpnను చూడాలన్నారు.

'పెండింగ్ క్లెయిమ్‌లను పరిష్కరించాలి'

భగత్‌నగర్, ఏప్రిల్ 2: ఆధార్ అప్‌డేట్ సమస్యలు, పెండింగ్ క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ కోటంరాజు డిమాండ్ చేశారు. నగరంలోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో యూనియన్ జిల్లా స్థాయి విస్తృత సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 18,930 భవన నిర్మాణ కార్మికుల లేబర్ కార్డులు ఇప్పటి వరకు రెన్యువల్ చేయలేదన్నారు. 2,698 పెండింగ్ క్లెయిమ్‌లు, ఆధార్ అప్‌డేట్‌లను పూర్తి చేయాల్సిందన్నారు. వీటన్నింటిని త్వరగా పూర్తి పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఎడ్ల రమేష్, కదిరె రమేష్, వట్టి జగదీష్, జంబుకం వెంకన్న, రాజకుమారి, అనుముల మల్లారెడ్డి, పాతూరి లింగారెడ్డి, రావుల ఎల్లయ్య, రేణిగుంట సారయ్య, చక్రపాణి, ఇజ్జగిరి సుధాకర్, బోయిని సంపత్, శనిగరం రాజు, సురేష్ పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ప్రారంభం

- స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా ఏసీపీ నర్సింహారెడ్డి



కమిషనరేట్ కేంద్రంలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 2: కమిషనరేట్ కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌ను ప్రా రంభించారు. ఈ సందర్భంగా సీపీ అభిషేక్ మొహంతి మాట్లా డతూ మంగళవారం నుంచి సైబర్ క్రైమ్ స్టేషన్ సేవలు పూర్తిస్థాయిలో అందు బాటులోకి వచ్చాయని తెలి పారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)గా ఏసీపీ నర్సిం హారెడ్డిని నియమించా మన్నారు. బాధితులు నేరుగా వచ్చి వారి సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు నేరం చేసే విధానాన్ని మార్చుతూ, ఖాతాల్లో ఉన్న డబ్బు దోచుకుంటారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నా రు. తెలియని వ్యక్తులకు ఫోన్ల ద్వారా పాస్ వర్డ్, ఓటీపీలు చెప్పవద్దని సూచించారు. ప్రలోభాలకు గురిచేసే లింక్‌లను క్లిక్ చేయడం వంటి విషయాల్లో జాగ్రత్తగా ఉండాల న్నారు. సైబర్ క్రైమ్‌కు గురైన బాధితులు వెంటనే సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని అన్నారు. బాధితులు టోల్‌ఫ్రీ నంబర్ అయిన 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.



సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో ఏసీపీ నర్సింహారెడ్డి

సైబర్ వారియర్స్ టీం ఏర్పాటు

కమిషనరేట్ వ్యాప్తంగా ఉత్పన్నమయ్యే సైబర్ నేరాలను అరికట్టేందుకు సైబర్ వారియర్స్ టీంను ఏర్పాటు చేశామని సీపీ తెలిపారు. ప్రతీ పోలీస్ స్టేషన్‌లో టెక్నాలజీపై అవగాహన ఉన్న సిబ్బందిని గుర్తించి వారిని సైబర్ వారియర్‌గా నియమిం చామన్నారు. క్షేత్ర స్థాయిలో బాధితులకు ఎప్పటికప్పుడు మెరుగైన సేవలు అందించేందుకుగాను వీరిని ఏర్పాటు చేశామన్నారు. వీరు సైబర్ నేరాల్లో ఆధారాలు సేకరించి నేరస్థులను పట్టుకుంటారని, వారికి శిక్ష పడేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు.

నగదు పట్టివేత

వేములవాడ రూరల్, ఏప్రిల్ 2: వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో లక్ష రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్సై మారుతి తెలిపారు. వట్టెంల గ్రామం వద్ద మంగళవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా వేములవాడకు చెందిన రాజశేఖర్ అనే వ్యక్తి సరైన ఆధారాలు లేకుండా లక్ష రూపాయలు ఉండడంతో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

● తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారులోని చెక్‌పోస్టు వద్ద 93,500నగదును మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు ఏఈ సుమన్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏఆర్ఎస్ఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

కేడీసీసీబీకి రూ.100 కోట్ల లాభం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 2: కరీంనగర్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (కేడీసీసీబీ) 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.100.10 కోట్ల స్థూల లాభాన్ని ఆర్జించి గత ఏడాది రికార్డును బ్రేక్ చేసిందని బ్యాంకు ముఖ్య కార్య నిర్వహణ అధికారి ఎన్.సత్యనారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 91.40 కోట్ల స్థూల లాభం నమోదు కాగా ఈ యేడాది రూ.8.70 కోట్లు అదనంగా లాభం ఆర్జించడం జరిగిందని అన్నారు. బ్యాంకు నిర్ధరక ఆస్తులు గత ఏడాది 0.97శాతం నుంచి ఈయేడు 0.75శాతానికి తగ్గిందని, 0.22శాతం తగ్గింపు గొప్ప విజయమని, ఇది బ్యాంకు పాలకవర్గం, ఉద్యోగులు, సిబ్బంది సమష్టి కృషితోనే సాధ్యమైందని చైర్మన్ కొండూరు రవీందర్‌రావు అభినందించారు. డిపాజిట్లలో కూడా 246.28 కోట్ల వృద్ధితో గత ఏడాది ఉన్న 2282.62 కోట్ల నుంచి 2528.90 కోట్లకు పెరిగాయని అన్నారు. అడ్వాన్సులు కూడా 18.85శాతం వృద్ధితో రూ.3973.34 కోట్లకు పెరిగాయని, బ్యాంకు మొత్తం వ్యాపారం రూ.876.24 కోట్లకు పెరిగిందని అన్నారు. మొత్తం వ్యాపారం 6501.24 కోట్లుగా నమోదైందని పేర్కొన్నారు. జిల్లాలో ఎస్‌బీఐ, యూబీఐ తర్వాత మూడో అగ్రగామి బ్యాంకుగా కేడీసీసీబీ నిలవడం గర్వకారణమని, ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రూ.7,550 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 2: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,550 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 42మంది రైతులు 614క్వింటాళ్ల విడి పత్తి, ఇద్దరు రైతులు నాలుగు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా కనిష్ఠ ధర రూ.6,200 చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



బోనంతో బారులు తీరిన భక్తులు

వేములవాడ, ఏప్రిల్ 2: శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ బద్ది పోచమ్మ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. సోమవారం తమ ఇష్టదైవమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు మంగళవారం బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు తెల్లవారుజామునే భక్తిశ్రద్ధలతో నైవేద్యం వండి బోనం తయారుచేసి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకొని బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భారీ సంఖ్యలో జనం తరలిరావడంతో క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి.

అదనపు కట్నం కోసం వేధింపులు

● కొడుకుకి విషగుళికలు తినిపించి మహిళ ఆత్మహత్య
● కూతురు, మనుమడి మరణాన్ని జీర్ణించుకోలేక ఆమె తల్లి బలవన్మరణం ● ఒకే కుటుంబంలో ముగ్గురి మృతి



రేయాన్స్ (ఫైల్)



గాదె శ్రీజ(ఫైల్)



జయప్రద(ఫైల్)

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 2: వరకట్న వేధింపులతో అత్తింటివారు కొట్టి పుట్టింటికి పంపించగా, ఈ గొడవలను భరించలేక తల్లిగారింటికి వచ్చిన ఓ గృహిణి పేగు తెంచుకొని పుట్టిన ఏడాది కూడా నిండని 11 నెలల కొడుకుకు విషగుళికలు ఇచ్చి అవే విషగుళికలు మింగి ఆత్మహత్యకు పాల్పడింది. కూతురు, మనుమడి బలవన్మరణాన్ని చూసి తట్టుకోలేని తల్లికూడా అవే విషగుళికలు వేసుకొని తనువు చాలించిన విషాద ఘటన కరీంనగర్ జిల్లా బొమ్మకల్ గ్రామపంచాయతీలోని విజయనగర్ కాలనీలో కలకలం రేపింది. 24 గంటల వ్యవధిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. పోలీసులు, కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి.

కరీంనగర్ శివారులోని బొమ్మకల్ గ్రామపంచాయతీ పరిధిలోని విజయనగర్ కాలనీకి చెందిన పూసల జయప్రద, వెంకటేశ్వరచారిలు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. వారికి ఇద్దరు కూతుళ్లు. చిన్న కూతురు గద్దె శ్రీజ(27)కు వరంగల్‌కు చెందిన మొద్దుంపూర్ నరేష్‌తో 2021 నవంబరు 27న వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.3 లక్షల వరకట్నంతో పాటు ఇతర లాంఛనాలు అత్తింటివారు ముట్టజెప్పారు. ఏడాది వరకు ఆ దంపతుల జీవనం సాఫీగా సాగింది. వారికి ఒక కొడుకు రేయాన్స్ అలియాస్ అర్విన్(11 నెలల 25 రోజులు)ఉన్నాడు. నరేష్ హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తూ వరంగల్ ఎల్లంబజారులో ఇంటి వద్దనే ఉంటూ వర్క్ ఫ్రం హోం చేస్తున్నాడు. అదనపు వరకట్నం విషయంలో ఇటీవల భార్యాభర్తలు శ్రీజ, నరేష్‌ల మధ్య తరచుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మార్చి 29న భర్త నరేష్, అత్త సుజాత, మామ కేశవాచారిలు కలిసి శ్రీజను కొట్టి, వరకట్నం తీసుకురావాలని కొడుకుతో సహా పుట్టింటికి పంపించారు. అయితే మంగళవారం ఉదయం 6 గంటలకు శ్రీజ తన భర్త నరేష్‌కు ఫోన్ చేసి ఈ నెల 5న కొడుకు రేయాన్స్ పుట్టినరోజు ఉందని, భర్తను రావాలని కోరగా తను రానని, మీరే చేసుకోండని ఆగ్రహం వ్యక్తం చేస్తూ భర్తతోపాటు అత్త, మామలు దూషిస్తూ నీవు చచ్చిపో అంటూ మాట్లాడారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన శ్రీజ ఉదయం ఏడు గంటలకు తన ఏడాది వయసున్న కొడుకు రేయాన్స్‌కు విషగుళికలు మింగించి తాను కూడా మింగింది. వెంటనే గుర్తించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేస్తుండగానే ఇంటి వద్దనే రేయాన్స్ మృతి చెందాడు. శ్రీజ స్పృహ కోల్పోయి నోటి నుంచి నురుగులు వస్తుండగా ఆటోలో అపోలోరీచ్ ఆసుపత్రికి తరలించారు. కొద్దిసేపటికి ఆసుపత్రిలో చికిత్స చేస్తుండగా శ్రీజ మరణించింది. అక్కడే ఉన్న శ్రీజ తల్లి పూసాల జయప్రద(51) ఆధార్‌కార్డు తీసుకువస్తానని ఇంటికి వెళ్లి బెడ్‌పైన ఉన్న విషగుళికలు మింగింది. పక్కనే ఉన్న ఒక మహిళ వారించేసరికే ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఆమెను వెంటనే కుటుంబ సభ్యులు ఆపోలోరీచ్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాయంత్రం మరణించింది. పూసాల జయప్రద కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుండగా ఆమె భర్త వెంకటేశ్వరాచారి మానకొండూర్‌లో జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. మృతులు శ్రీజ తండ్రి, జయప్రద భర్త వెంకటేశ్వరచారి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శ్రీజ తన కొడుకును హత్య చేసినట్లు కేసు నమోదుకాగా శ్రీజను భర్త నరేష్, అత్త సుజాత, మామ కేశవాచారిలు వరకట్నం కోసం వేధించినట్లు, వారి వేధింపుల కారణంగానే శ్రీజ, ఆమె తల్లి జయప్రద ఆత్మహత్య చేసుకున్నట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కరీంనగర్ రూరల్ ఎస్‌ఐ వెంకట్రాజం తెలిపారు.

● విష ప్రభావం కలిగిన టాబ్‌లెట్స్ ఎక్కడి నుంచి వచ్చాయనేది అంతుబట్టకుండా ఉంది. ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసి శ్రీజ తెప్పించుకుని ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. శ్రీజ ఆసుపత్రిలో మరణించగానే ఆధార్‌కార్డు కోసం అని మరో మహిళతో ఇంటికి వెళ్లిన జయప్రద ఇంటిలో బెడ్‌పైన ఉన్న ఆ విషగుళిక ఒక్కటి నోటిలో వేసుకోగా అక్కడే ఉన్న మహిళ ఆ గుళికను బలవంతంగా తీసేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. ఆ క్షణంలోనే జయప్రద స్పృహకోల్పోయిందని బంధువులు తెలిపారు. ఆత్మహత్యకు నిర్ణయించుకునే సెనేడ్ అంతటి విషం కలిగిన గుళికలను శ్రీజ తెప్పిచ్చుకుని ఉంటుందని భావిస్తున్నారు.

● మరో మూడు రోజుల్లో రేయాన్స్ పుట్టినరోజు ఉండగా అంతలోనే ఈ ఘటన జరుగడం ఆ కుటుంబంలో విషాదం నింపింది. ఈ ఘటనను తలుచుకుని బంధువులతో పాటు గ్రామస్థులు కంటనీరు పెట్టారు. కొన్ని గంటల ముందు ఇంటిలో కూతురు, భార్య, మనుమడితో గడిపిన తండ్రి ఆ ముగ్గురు మరణంతో ఒంటరివాడయ్యాడు.

జలపతి తండాలో వివాహిత ఆత్మహత్య



శోభ (ఫైల్)

చందుర్తి, ఏప్రిల్ 2: చందుర్తి మండలం దేవుడి తండా గ్రామపంచాయతీ పరిధిలోని జలపతి తండాలో గుగులోతు శోభ(25) అనే మహిళ అదనపు వరకట్నం వేధింపులు తాళలేక మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. చందుర్తి మండలం దేవుని తండా గ్రామ పంచాయతీ పరిధిలోని జలపతి తండాకు చెందిన గుగులోతు జలం ధర్‌కు వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామానికి చెందిన శోభతో ఆరు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వివాహ సమయంలో కట్నకానుకలు ఇచ్చి పెళ్లి జరిపించారు. వివాహం జరిగిన కొద్దిరోజులు వీరి కాపురం సాఫీగానే సాగింది. వీరికి నాలుగు సంవత్సరాల క్రితం కుమారుడు జన్మించాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య అదనపు వరకట్న వేధింపుల గొడవలు జరుగుతున్నాయి. కాగా సోమవారం అర్ధరాత్రి ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. వరకట్న వేధింపులతో శోభ చనిపోయిందని మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు తహసీల్దార్ శ్రీనివాస్ సమక్షంలో పంచనామా నిర్వహించి, డీఎస్పీ నాగేంద్రచారి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 2: జగిత్యాల అర్బన్ మండలం మోతె చెరువులో ఈతకు వెళ్లి విద్యార్థి మంగళవారం మృతి చెందాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల పట్టణంలోని నాగేంద్రనగర్ కాలనీకి చెందిన రొడ్డ ఉమ మహేష్ (14) జగిత్యాల పట్టణ శివారులోని మోతె చెరువులోకి తన స్నేహితులతో కలిసి ఈతకొట్టేందుకు వెళ్లాడు. ఈత కొడుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సదాకర్ తెలిపారు.

వీడనున్న విద్యార్థి మృతి మిస్టరీ

● వ్యవసాయ బావిలో మృతుడి తల లభ్యం ● పరీక్షల కోసం హైదరాబాద్‌కు పంపించిన పోలీసులు

తిమ్మాపూర్, ఏప్రిల్2: ఓ ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమా మొదటి సంవత్సరం చదువుతున్న ఎనగంటి అభిలాష్ గత మార్చి 1న కళాశాల నుంచి బయటకు వెళ్లి 27 రోజుల తరువాత మార్చి 27న తిమ్మాపూర్ గ్రామంలోని ఓ వ్యవసాయ బావిలో కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం లభించింది. మృతదేహానికి తల లేకపోవడంతో విద్యార్థి అభిలాష్ ఆత్మహత్య చేసుకున్నడా? లేక ఎవరైనా హత్య చేశారా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. విద్యార్థి కుటుంబ సభ్యులు కూడా విద్యార్థి అభిలాష్ మృతిపై అనుమానాలు ఉన్నాయని ఎల్ఎండి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిమ్మాపూర్ సిఐ కర్రె స్వామి, ఎల్ఎండి ఎస్సై చేరాలు ఆరు రోజులుగా బావిలో ఉన్న నీటిని పెద్ద మోటర్లు, క్రేన్‌ల సహాయంతో, మనుషులను పెట్టి తీసేందుకు ప్రయత్నించగా మంగళవారం ఉదయం బావిలో తల భాగం(పుర్రె) లభించింది. సిఐ స్వామి, గన్నేరువరం ఎస్సై నరేష్ క్రేన్ సహాయంతో వ్యవసాయ బావిలోకి దిగి దానికి బయటకి తీయించారు. పుర్రెను హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించి డీఎన్ఏ పరీక్షతో పాటు గాయాలేమైనా ఉన్నాయా అనే కోణంలో విచారణ చేపట్టనున్నారు. రిపోర్టుతో కేసు కొలిక్కి వచ్చే అవకాశం ఉందని, నివేదిక వచ్చేందుకు సుమారు నెల రోజుల సమయం పట్టే అవకాశం ఉందని సీఐ స్వామి తెలిపారు. బావిలో నీటిని తోడేందుకు కృషి చేసిన వారిని అభినందించారు.

యువకుడి ఆత్మహత్య



అరుణ్(ఫైల్)

జ్యోతినగర్,ఏప్రిల్2: ఎన్టీపీసీ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో దూకి మంగళవారం ములుకుంట్ల అరుణ్(23) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎల్కలపల్లి గేట్ ప్రాంతానికి చెందిన అరుణ్ మృతదేహాన్ని ఎన్టీపీసీ పోలీసులు రిజర్వాయర్ నుంచి బయటకు తీసి పోస్టుమార్టం కోసం గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతికి గల కారణాలను దర్యాప్తు చేస్తున్నారు. ఎన్టీపీసీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 2 : మండలంలోని బొంపల్లి గ్రామానికి చెందిన దాడి శ్రీనివాస్(45) అనుమానాస్పదంగా మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం బొంపల్లి గ్రామానికి చెందిన దాడి శ్రీనివాస్ రోజువారీగా గొర్ల కాపరిగా ఉంటూ సోమవారం ఇంటికి వచ్చాడు. రాత్రి సమయంలో ఇంటి ముందు పడుకోగా ఉదయం లేచి చూసేసరికి మంచం కిందపడి ఉన్నాడు. మృతుడి భార్య సుజాత గమనించి పెద్దపల్లి ఆసుపత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు తలకు తీవ్రగాయమైందని మృతిచెందినట్లు తెలిపినట్లు పేర్కొన్నారు. మృతుని భార్య దాడి సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి



అఖిల్(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 2: మండలంలోని సింగాపూర్ గ్రామ శివా రులో మార్చి 30వ తేదీన హుజూరాబాద్ పట్టణానికి చెందిన ఇజ్జిగిరి అఖిల్ రోడ్డు ప్రమాదానికి గురికాగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అఖిల్ స్థానికంగా ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతుండగా తన మిత్రులను కలిసేందుకు సింగాపూర్ గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ప్రమాదం చోటు చేసుకుంది. చికిత్స కోసం హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

కుక్కకాటుతో యువకుడి మృతి



అరుణ్ (ఫైల్)

కోనరావుపేట, ఏప్రిల్ 2: మండలంలోని ధర్మారంలో కుక్క కాటుకు మంకు అరుణ్ (28) అనే యువకుడు మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. ధర్మారం గ్రామానికి చెందిన మంకు వినోద, శంకర్ దంపతులు నిజామాబాద్ గ్రామంలో నివాసం ఉంటున్నారు. వీరి కుమారుడు అరుణ్ ధర్మారం గ్రామంలో ఉంటున్న నానమ్మ ఇంటి వద్ద ఉంటున్నాడు. రెండు నెలల క్రితం నిజామాబాద్ గ్రామంలోని తల్లిదండ్రుల వద్దకు వచ్చిన క్రమంలో గ్రామంలో పలువురితో పాటు అరుణ్‌ను పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచింది. కుక్క కాటుకు వైద్యం చేయించుకున్నప్పటికీ 15 రోజుల క్రితం అస్వస్థతకు గురయ్యాడు. చికిత్స నిమిత్తం హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి సోమవారం రాత్రి మృతి చెందాడు.

గంజాయి రవాణా చేస్తున్న తొమ్మిది మంది అరెస్ట్



మాట్లాడుతున్న ఏసీపీ రమేష్



పట్టుకున్న గంజాయితో పోలీసులు (ఫైల్)

● రెండు కిలోల గంజాయి స్వాధీనం

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 2: గంజాయి రవాణా చేస్తున్న రెండు ముఠాలను అరెస్ట్ చేసినట్టు గోదావరిఖని ఏసీపీ రమేష్ తెలిపారు. మంగళవారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఏసీపీ మాట్లాడారు. గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి న్యూమారేడుపాక చౌరస్తా వద్ద సోమవారం సాయంత్రం తనిఖీలు జరుపుతున్న సమయంలో ఇద్దరు యువకులు గంజాయి తరలిస్తూ పట్టుబడినట్టు ఏసీపీ పేర్కొన్నారు. వారివద్ద కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. పాలకుర్తి నుంచి గంజాయి తీసుకు వచ్చి యైటింక్లయిన్‌కాలతో పాటు సమీప ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్టు తెలిపారు. కమాన్‌పూర్‌పోలీస్‌స్టేషన్ పరిధి జూలపల్లి శివారులో గంజాయి తరలిస్తున్న ఏడుగురిని కమాన్‌పూర్ పోలీసులు పట్టుకుని, వారి వద్ద కిలో గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. విలేకరుల సమావేశంలో సీఐ బీ రవీందర్, సీఐ-2 లింగమూర్తి, కమాన్‌పూర్ ఎస్సై చంద్రశేఖర్, టూటౌన్ ఎస్సైలు వెంకటేష్, సనత్‌కుమార్ పాల్గొన్నారు.

ఠాణాలో ఉంచిన గంజాయి మాయం

సారంగాపూర్ : పోలీసుల తనిఖీల్లో పట్టుకున్న గంజాయిని గుర్తు తెలియని వ్యక్తులు ఏకంగా ఠాణా నుంచి ఎత్తుకెళ్లిన ఘటన చర్చనీయాంశంగా మారింది. 2023 ఫిబ్రవరిలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా రాజస్థాన్‌కు చెందిన ఓ అంబులెన్స్‌లో 70 కిలోల గంజాయి లభ్యమైంది. పోలీసులు నలుగురు నిందితులను పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టుకున్న గంజాయిని అదే అంబులెన్స్‌లో భద్రపరిచి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై క్వార్టర్ పక్కన పార్కింగ్ చేశారు. సోమవారం ఉదయం పోలీసులు అంబులెన్స్‌ను పరిశీలించగా అంబులెన్స్ అద్దాలు పగులగొట్టి అందులోని గంజాయిని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, అదనపు ఏఎస్పీ వినోద్ కుమార్, డీఎస్పీ రఘు చందర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏకంగా పోలీస్‌స్టేషన్ నుంచి గంజాయి మాయం కావడంతో ఎస్పీ తీవ్రంగా పరిగణిస్తున్నట్లు తెలిసింది.

ఎక్సైజ్ అధికారుల మెరుపు దాడులు

10 లీటర్ల గుడుంబా, 800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

కోనరావుపేట, ఏప్రిల్ 2: మండలంలోని పలు తండాల్లో కరీంనగర్ అసిస్టెంట్ కమిషనర్ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించి ఐదు లీటర్ల గుడుంబా, ఎనిమిది వందల లీటర్ల బెల్లం పానకమును ధ్వంసం చేశారు. ఎక్సైజ్ సీఐ ఎం శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి తండా, గోవిందరావుపేట తండాలో గుడుంబాను తయారు చేస్తున్నారన్న సమాచారం మేరకు మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 10 లీటర్ల గుడుంబా, 800 లీటర్ల బెల్లం పానకమును స్వాధీనం చేసుకొని ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ అధికారులు సూపరింటెండెంట్ పంచాక్షరి, ఎక్సైజ్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

● పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

ఇల్లంతకుంట, ఏప్రిల్ 2: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగానికి నిధులు కేటాయించడమే కాకుండా పనులు సత్వరమే అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇవ్వడంతో పాటు బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని కోరారు. పదవీవిరమణ పొందిన ఉపాధ్యాయులకు బాండ్‌లు ఇవ్వాలనే ప్రతిపాదనను వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పీఆర్టీయూ కృషిచేస్తుందని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, సంఘ నాయకులు శశిధర్‌శర్మ, తూముకుంట మోహన్‌రెడ్డి, మాన్వాడ శంకర్, సందీప్‌రెడ్డి, బాల్‌రెడ్డి, వనపర్తి వెంకటేష్ ఉన్నారు.

ప్రజా అభిప్రాయం మేరకే మేనిఫెస్టో

● బీజేపీ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు ఎస్.కుమార్



రైతుల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్న మేనిఫెస్టో కమిటీ సభ్యులు

భగత్‌నగర్, ఏప్రిల్ 2: ప్రజా అభిప్రాయం మేరకే భారతీయ జనతాపార్టీ మేనిఫెస్టో ఉంటుందని మేనిఫెస్టో కమిటీ సభ్యుడు, ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ అన్నారు. మంగళవారం నగరంలోని ఎంపీ కార్యాలయంలో రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించి త్వరలో బీజేపీ పక్షాన ప్రజా మేనిఫెస్టోను విడుదల చేస్తామన్నారు. ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలను సేకరించి విడుదల చేస్తామన్నారు. రైతులు ఏం కోరుకుంటున్నారో అభిప్రాయాలను చెప్పాలన్నారు. సమావేశంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జయశ్రీ, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు పాల్గొన్నారు.

వేములవాడలో ఒకరి దారుణ హత్య

● మద్యం మత్తులో స్నేహితుడే కడతేర్చినట్లు అనుమానం



సిర్రం మహేశ్(ఫైల్)

వేములవాడ, ఏప్రిల్ 2: మద్యం మత్తులో కిరాతకంగా బండరాయితో కొట్టి స్నేహితుడినే చంపిన సంఘటన వేములవాడ పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన సిర్రం మహేశ్ (46) రెండు సంవత్సరాలుగా వేములవాడలో కూలి పని చేస్తూ ఉపాధి పొందుతున్నాడు. స్థానిక భగవంతరావునగర్‌లో ఓ గది అద్దెకు తీసుకొని ఒంటరిగా ఉంటున్న మహేష్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మరో వ్యక్తితో పరిచయం ఏర్పడడంతో ఇద్దరు కలిసి తరచూ మద్యం సేవించేవారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఇద్దరూ కలిసి మద్యం సేవించిన తర్వాత ఇరువురి మధ్య మాటామాటా పెరగడంతో తోటి స్నేహితుడు రాయితో ముఖంపై బాదడంతో మహేష్ అక్కడికక్కడే చనిపోయాడు. సోమవారం ఉదయం ఇంటి అద్దె వసూలు కోసం వచ్చిన యజమాని శ్రీనివాస్ ఎంత పిలిచినా స్పందన లేకపోవడంతో తలుపు నెట్టగా తలుపు తెరుచుకుంది. ఇంట్లో మంచంపై ఎలాంటి చలనం లేకుండా పడి ఉన్న మహేష్‌ను చూసి తమకు సమాచారం అందించాడని పోలీసులు తెలిపారు. హత్య ఘటన సమాచారం తెలుసుకున్న వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, పట్టణ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మద్యం సేవించిన అనంతరం మహేష్‌పై రాయితో దాడికి పాల్పడి హత్యకు కారణమైన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనపై మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్ తెలిపారు.

కొండాపూర్‌లో విషాదం

ముస్తాబాద్: వేములవాడలో సోమవారం రాత్రి జరిగిన ఘటనలో కొండాపూర్ గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. తాగిన మత్తులో జరిగిన దాడిలో కొండాపూర్‌కు చెందిన సిర్రం మహేశ్ మృతి చెందాడని స్థానికులు తెలిపారు. కొంత కాలంగా వేములవాడలో కూలి పనిచేసుకుంటున్న మహేశ్ స్నేహితులతో జరిగిన గొడవలో మరణించాడని పేర్కొన్నారు. కనీసం ఇల్లు కూడా లేని సిర్రం మహేశ్ మృతదేహాన్ని పోస్టుమార్టమ్ అనంతరం నేరుగా ఊళ్లో దహన సంస్కారాలకు తీసుకువెళ్లడం పలువురిని కలిచి వేసింది. మహేశ్‌కు భార్య సిర్రం పద్మ, ఇద్దరు పిల్లలున్నారు.

విద్యార్థులు విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

-శాతవాహన యూనివర్సిటీ వీసీ మల్లేష్



మాట్లాడుతున్న వీసీ ఆచార్య సంకశాల మల్లేష్

గణేశ్‌నగర్, ఏప్రిల్2: విద్యార్థులు విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని శాతవాహన విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ ఆచార్య సంకశాల మల్లేష్ అన్నారు. శనివారం వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో సూరి జనరిస్-2024 పేరిట బీబీఏ, ఎంబీఏ విద్యార్థుల కోసం ఒక్క రోజు సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ విద్యార్థులకు విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించడానికి సదస్సులు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షల విభాగాధిపతి డాక్టర్ ఎస్.వి.శ్రీరంగప్రసాద్ మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ విద్యార్థులు ఎల్లప్పుడూ కొత్త విషయాలను పరిశోధించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలను ఉపయోగించుకోవాలని సూచించారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ ఆర్.కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఈసదస్సులో బీబీఏ విద్యార్థుల కోసం 16 రకాల పోటీలను, ఎంబీఏ విద్యార్థుల కోసం 15 రకాల పోటీలను ఆన్‌లైన్‌లో నిర్వహించామని తెలిపారు. ఈ సదస్సులో పూర్వ కరీంనగర్ జిల్లా నుంచి 304మంది విద్యార్థులు పాల్గొన్నారు.

'సంప్రదాయాలకు పుట్టినిల్లు భారతదేశం'



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 2: సంస్కృతి, సంప్రదాయాలకు పుట్టినిల్లు భారతదేశమని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం రేకుర్తిలోని శుభం గార్డెన్స్‌లో అల్ఫోర్స్ సమ్మోహనం పేరుతో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్ని అంశాలలో పట్టు సాధించాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుజాత

సుభాష్‌నగర్, ఏప్రిల్ 2: జిల్లా ఆసుపత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవాన్ని నిర్వహించారు. మంగళవానం జిల్లా వైద్యఆరోగ్యశాఖ, చల్మెడ, ప్రతిమ మెడికల్ కాలేజీలు సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి డీఎంహెచ్‌వో సుజాత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆటిజం పిల్లల్లో ఎదుగుదల ఒక సమస్య అని తెలిపారు. ఈ సమస్య ఉన్న పిల్లల్లో ఈ సమస్యలను ఎదుర్కొనేందుకు థెరపీలు ఇప్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజెషన్ అధికారి డాక్టర్ సాజిదాఅతహరి, ఆర్‌ఎంవో డాక్టర్ నవీన, చెల్మెడ, ప్రతిమ వైద్య కళాశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘన నివాళి

గణేశ్‌నగర్, ఏప్రిల్ 2 : పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతి సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ నివాళులు అర్పించారు. జ్యోతినగర్ లోనిబీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సంస్మరణ సభలో పాల్గొన్నారు. జిల్లా బీసీ నాయకులు మాట్లాడుతూ సర్వాయి పాపన్న వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు.

తాగునీటి సమస్యపై దృష్టి సారించాలి

● అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్

రామడుగు, ఏప్రిల్ 2: వేసవిలో తాగునీటి సమస్యపై దృష్టి సారించాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్ అధికారులను ఆదేశించారు. మండలంలోని వెలిచాల గ్రామంలో ఆయన తాగు నీటి బావిని పరిశీలించారు. అనంతరం మంచినీటి సమస్యపై సమావేశం నిర్వహించారు. అంతకు ముందు గ్రామంలో నర్సరీ, లైబ్రరీ రీడింగ్‌రూంను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వరీ, ఎంపీవో రాజశేఖర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సైనికుడికి ఘన స్వాగతం

చొప్పదండి, ఏప్రిల్ 2: చొప్పదండి మండలంలోని వెదురుగట్ట గ్రామానికి చెందిన సైన్యాధికారి పదవీ విరమణ చేశారు. ఆర్మీలో జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్‌గా పనిచేసి పదవీ విరమణ చేసి మంగళవారం స్వగ్రామానికి రాగా చొప్పదండిలో ఘనస్వాగతం పలికారు. చొప్పదండి నుంచి వెదురుగట్ట గ్రామం వరకు సైనికుడు మల్లయ్యను ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయనను పలువరు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జయహో జనత జవాన్ ఫౌండేషన్ సైనికులు, ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మెహన్, రాజిరెడ్డి, శంకర్‌రావు, శ్రీనివాస్, పైడి మహేశ్, పంతంగి ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి

హనుమకొండ టౌన్/శంకరపట్నం, ఏప్రిల్2: ఆర్టీసీ బస్సు ఢీకొని హనుమకొండ బస్టాండ్ ఆవరణలో యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. కేశవపట్నం మండలం కొత్తగట్టు గ్రామానికి చెందిన రామగిరి శ్రీనివాస్ (30) హనుమకొండ గోకుల్‌నగర్‌లో కిరాయి ఉంటూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. హైదరాబాద్ వెళ్లేందుకు సోమవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో హనుమకొండ బస్టాండ్‌కు వస్తున్నక్రమంలో జనగామ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా అతివేగంతో వచ్చి ఢీకొట్టగా శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు హనుమకొండ పోలీసులు బస్సు డ్రైవర్ జూలూరి వెంకటేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతు దీక్షకు మద్దతు

జమ్మికుంట, ఏప్రిల్ 2: కరీంనగర్ పార్లమెంట్ రైతుల కోసం బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ చేపట్టిన రైతు దీక్షకు మద్దతుగా జమ్మికుంట నుంచి బీజేపీ నాయకులు మంగళవారం తరలివెళ్లారు. జిల్లా ఉపాధ్యక్షులు ఎరబెల్లి సంపత్‌రావు, పట్టణ అధ్యక్షులు జీడి మల్లేష్‌లు బండి సంజయ్‌ని ఘణంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల రాజేందర్, పల్లపు రవి, ఠాగూర్ రాజేష్, కైలాస్‌కోటి గణేష్, తుడి రవిచంద్రరెడ్డి, మేక సుధాకర్‌రెడ్డి, మోడం రాజు, ప్రశాంత్, రాము, జనార్ధన్‌రెడ్డి, సమ్మయ్య, పాపయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్‌కు సన్మానం

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 2: తెలంగాణ రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా నూతనంగా నియామకమైన కల్వ సుజాతను జమ్మికుంట వాసవి వనిత క్లబ్ ప్రెసిడెంట్ మురికి పూర్ణిమ హైదరాబాద్‌లో మంగళవారం ఘణంగా సన్మానించారు. ఆమె వెంట వాసవి వనతి క్లబ్ సభ్యులు ఉన్నారు.

1.98 కోట్ల లాభాలతో కేడీసీసీ బ్యాంకు

● బ్యాంకు మేనేజర్ గూడూరి అనిత

చిగురుమామిడి, ఏప్రిల్ 2: మండల కేంద్రంలోని కేడీసీసీ బ్యాంకు ప్రస్తుతం 1.98 కోట్ల లాభాలతో కొనసాగుతోందని మేనేజర్ గూడూరి అనిత తెలిపారు. మంగళవారం విలేఖరులతో మాట్లాడారు. 2017 సంవత్సరంలో ప్రాంభమైన బ్యాంకు ఖాతాదారుల సహకారంతో 2023-2024 ఆర్థిక సంవత్సరానికి 27.14 కోట్ల డిపాజిట్లతో 40.21 కోట్ల రుణాలతో మొత్తం 67.35 కోట్ల టర్నోవర్‌కు చేరుకున్నట్టు తెలిపారు. తమ బ్యాంకు ద్వారా అనేక రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు.బ్యాంకు అభివృద్ధికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

'పంటలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలి'



కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 2: జిల్లాలో పంటలు ఎండిపోకుండా సాగునీరు అందించాలని బీఆర్‌ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం బీఆర్ ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు కలెక్టర్‌ను కలిసి రైతాంగ సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పంటలు ఎండిపోతాయనే ఆందోళనలో కొట్టుమిట్టాడుతున్నారని, పంటలు ఎండిపోకుండా సాగు నీరందించాలని కోరారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు, ఎండిన పంటలకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కనీస మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వాలని కోరారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎండదెబ్బ బారిన పడకుండా సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ అక్బర్ హుస్సేన్, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, బీఆర్‌ఎస్‌వీ జిల్లా కో ఆర్డినేటర్ దావ మధుసూదన్‌రెడ్డి, నాయకులు కులదీప్‌వర్మ, షౌకత్ మీర్, వొడ్నాల రాజు, గుంజపడుగు హరిప్రసాద్, కెంసారపు తిరుపతి, సుకూర్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలకు

క్రీడా పాఠశాల విద్యార్థులు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 2: బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో ఈనెల 6 నుంచి 9 వరకు నిర్వహించే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా కేంద్రంలోగల క్రీడా పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల హన్మకొండలోని జవహర్‌లాల్ స్టేడియంలో నిర్వహించిన అండర్-17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీల్లో విశేష ప్రతిభ చాటిన క్రీడా పాఠశాల విద్యార్థులు దీపిక, అంజలి జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లీలప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, అథ్లెటిక్స్ కోచ్ పవన్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

'పార్టీ ఫిరాయింపులు నేర్పిందే కేసీఆర్'

సుభాష్‌నగర్, ఏప్రిల్ 2: గతంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు పార్టీ ఫిరాయింపులు నేర్పిందే కేసీఆర్ అని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన హరీష్‌రావు, కేటీఆర్‌లు ఏ ముఖం పెట్టుకొని ఇపుడు ప్రజల్లోకి వెళుతున్నారని ప్రశ్నించారు. ధరణి సమస్యల మూలంగా నేటికీ రైతులు చనిపోతూనే ఉన్నారని వాపోయారు. ప్రతిపక్ష నాయకుల ఫోన్లు, జర్నలిస్టులు, సినిమా హీరోలు, హీరోయిన్లు, ప్రముఖ నాయకుల ఫోన్లు ట్యాపింగ్ చేసి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడి నాటి టీఆర్‌ఎస్ ప్రభుత్వం కోట్ల రూపాయల దోపిడీకి పాల్పడిందని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు పిల్లర్లు కుంగి దెబ్బతినడం నిజం కాదా అని ప్రశ్నించారు. ఇండియా కూటమికి ప్రజామిత్ర మద్దతు తెలుపుతుందన్నారు. దేశంలో రాహుల్‌గాంధి, రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వం అవసరమన్నారు. కరీంనగర్ పార్లమెంట్ టికెట్ మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డికి ఇస్తే బాగుంటుందని హైకామండ్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిగిరి శ్రీధర్, బోయినిపల్లి చంద్రయ్య, బాపురెడ్డి, నరసయ్య, గజ్జల రమి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 2: నగరంలోని తీగలగుట్టపల్లి జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో విద్యార్థులకు పరీక్షా సామ గ్రిని పంపిణీ చేశారు. పాఠశాలలో పూర్వ ఉపాధ్యాయురాలు ఠాకూర్ అనిత ఆధ్వర్యంలో విద్యార్థులందరికీ పరీక్ష ప్యాడ్స్‌ను ప్రధానోపాధ్యాయురాలు కరుణ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

స్వాతంత్ర్య సమరయోధుడికి ఘన నివాళి

తిమ్మాపూర్, ఏప్రిల్2: మండలంలోని ఎల్‌ఎండీ కాలనీలో గల జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ ఉపాధ్యక్షులు జువ్వాడి మధుసూదన్‌రావు మృతి సంస్థకు తీరని లోటు అని ట్రస్టు చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం మానసిక వికలాంగుల పాఠశాలలో జువ్వాడి మధుసూదన్ రావు సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చాడ వెంకట్ రెడ్డి హాజరై మదుసూదన్‌రావు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు కోశాధికారి గుర్రం కొమిరెల్లా రెడ్డి, ట్రస్టీ సముద్రాల జనార్ధన్ రావు, ఎవో బాలరాజు, ప్రిన్సిపాల్ సతీష్, ఉపాధ్యాయులు, సిబ్బంది, మానసిక వికలాంగ విద్యార్థులు పాల్గొన్నారు.

'యూనివర్సిటీల్లో నియామకాలపై విచారణ చేపట్టాలి'



మాట్లాడుతున్న మాదం తిరుపతి

గణేశ్‌నగర్, ఏప్రిల్2: రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో గత ప్రభుత్వ హయాంలో నియమితులైన అధికారులపై తక్షణమే విచారణ జరపాలని యూఎస్ ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి డిమాండ్ చేశారు. భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ ముకరంపుర లోని జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేసిన వారిని వీసీలుగా, రిజిస్ట్రార్‌లుగా నియమించారన్నారు. దీంతో వారు గత ప్రభుత్వానికి తొత్తుగా వ్యవహరించి యూనివర్సిటీలను భ్రష్టు పట్టించాలని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి అనుకూలంగా నిర్ణయాలు తీసుకొని విద్యార్థులను చదువుకు దూరం చేసే కుట్ర చేశారని తెలిపారు. ఇప్పటికైనా యూనివర్సిటీల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. రాజకీయాలకు అతీతంగా వీసీ, రిజిస్ట్రార్లను నియమించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలా కాకుండా విద్యాభివృద్ధి కోసం యూనివర్సిటీల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో కుమార్ అనిల్ నవీన్ మహేష్ చైతన్య అఖిల్ పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

'దీక్ష పేరుతో మోసం చేసేందుకు బండి సంజయ్ యత్నం'

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 2: పార్లమెంట్‌లో ఒక్క రోజైనా రైతు సమస్యలపై ప్రస్తావించని ఎంపీ బండి సంజయ్‌కుమార్ దీక్ష పేరుతో మోసం చేసే యత్నం చేస్తున్నారని బీఆర్‌ఎస్ నేత, సివిల్ సప్లయి కార్పొరేషన్ మాజీ చైర్మన్, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ విమర్శించారు. రైతుల పక్షాన దీక్ష చేసే నైతిక హక్కు ఆయనకు లేదన్నారు. మంగళవారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో మీడియా సమావేశంలో రవీందర్‌సింగ్ మాట్లాడుతూ బండి సంజయ్‌కుమార్ దీక్షల పేరుతో రాజకీయ డ్రామాలకు తెరలేపుతున్నారని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికలు దగ్గరకు రాగానే సంజయ్‌కి మళ్లీ దీక్షలు గుర్తుకొచ్చాయని అన్నారు. ఎన్నికలు రాగానే మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం బండి సంజయ్‌కి వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను గెలిపిస్తే కరీంనగర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుం దన్నారు. సమావేశంలో నాయకులు గుంజ పడుగు హరిప్రసాద్, పొన్నం అనిల్‌గౌడ్, కెమసారం తిరుపతి, పెండ్యాల మహేశ్, తుల భాస్కర్‌రావు, జయంత్ పాల్గొన్నారు.

'మాదిగలను మోసం చేస్తున్న కాంగ్రెస్‌ను ఓడించాలి'



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 2: మాదిగలను మోసం చేస్తున్న కాంగ్రెస్‌ను ఓడించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ మాదిగ అన్నారు. మంగళవారం రేకుర్తిలోని సాయి మహాలక్ష్మి గార్డెన్స్‌లో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ విషయంలో కాంగ్రెస్ మాదిగలను మోసం చేస్తూనే ఉందన్నారు. మూడు ఎస్సీ పార్లమెంట్ స్థానాల్లో ఒక్క సీటు కూడా మాదిగలకు కేటాయించలేదన్నారు. గడిచిన పది సంవత్సరాల్లో బీఆర్‌ఎస్ మాదిగలను అన్నిరంగాల్లో మోసం చేసిందన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశం తుది దశకు చేరుకుందని పార్లమెంట్ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్‌ను గెలుపు కోసం శ్రమించాలన్నారు. ఈ సమావేశంలో ఇంజం వెంకటస్వామి, తుంగ అంజనేయులు, రుద్రారపు రాంచందర్, దండు అంజయ్య, ఎలగందుల బిక్షపతి, తునికి వసంత్, కనపూర్ లక్ష్మణ్, చెంచాల నవీన్, కనకం అంజిబాబు, ఎర్ర ఆదిత్య, దేవునూరి రవీందర్, గుండ థామస్ పాల్గొన్నారు.

ఘనంగా సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి



శంకరపట్నంలో నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

హుజూరాబాద్, ఏప్రిల్ 2: హుజూరాబాద్ పట్టణంలోని సైదాపూర్ క్రాస్ రోడ్ వద్ద సర్వాయి పాపన్న వర్ధంతిని తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు టి రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్, సురేష్, రాంశంకర్‌గౌడ్, సదానందం, కుమార్, ఎల్లయ్య, సారయ్య, శ్రీధర్, తిరుపతి, అయిలయ్య తదితరులు పాల్గొన్నారు.

● శంకరపట్నం: శంకరపట్నం మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి గౌడ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, కులస్థులు పాల్గొన్నారు.

● ఇల్లందకుంట, ఏప్రిల్ 2: మండల కేంద్రంలోని ప్రధాన కూడలి వద్ద సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని గౌడ సంఘం మండలాధ్యక్షుడు మోటపోతుల దేవేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బుర్ర నర్సయ్య, పైడిపల్లి వీరస్వామి, శ్రీనివాస్, శివకుమార్, రాము, మహేష్, తిరుపతి, జితేందర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

● జమ్మికుంట: జమ్మికుంట పట్టణంలోని గాంధీ చౌరస్తాలో సర్వాయి పాపన్న 314వ వర్ధంతిని గౌడ కులస్థులు మంగళవారం ఘణంగా నిర్వహించారు. ఈ సందర్భం చిత్ర పటానికి పూల మాలలు వేసి, ఘణ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గౌడ కులస్థులు మాట్లాడుతూ సర్వాయి పాపన్న చేసిన వీరోచిత పోరాటం గురించి కొనియాడారు. కార్యక్రమంలో గట్టు వీరన్న, పూదరి విజయ్, కొమురయ్య, శ్రీనివాస్, సురేష్, రవిందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● చిగురుమామిడి: మండల కేంద్రంలో, మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం సర్వాయి పాపన్న వర్ధంతి జరుపుకున్నారు. మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి దళితబహుజన నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షుడు తళ్లపెల్లి తిరుపతిగౌడ్, జడ్పిటిసి గీకురు రవీందర్, అన్ని గ్రామాల గౌడ సంఘం నాయకులు, అన్ని కుల సంఘలనాయకులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు



బూరుగుపల్లిలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

గంగాధర, ఏప్రిల్ 2: ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించేకునేందుకు పోలీసు యంత్రాంగం సహకారం ఎల్లవేళలా ఉంటుందని చొప్పదండి సీఐ ప్రకాశ్‌గౌడ్ అన్నారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా మంగళవారం బూరుగుపల్లి, గంగాధర గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సీఐ మాట్లాడుతూ ఎన్నికల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన వారిపై, అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ కిరణ్‌రెడ్డి, పారమిలటరీ బలగాలు పాల్గొన్నాయి.

● చిగురుమామిడి : రానున్న పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు, నాయకులు సహకరించాలని ఎస్సై బండి రాజేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కేంద్రబలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అందరూ కృషి చేయాలని అన్నారు. పోలీస్‌కు సహకరిస్తే తాము కుడ అన్ని విధాలుగా సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్థ పాల్గొన్నారు.

వేణుగోపాల స్వామి ఆలయాన్ని సందర్శించిన ఎంపీ



వేణుగోపాలస్వామి ఆలయంలో బండి సంజయ్‌కుమార్

శంకరపట్నం, ఏప్రిల్ 2: శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామంలోని పురాతన శ్రీవేణుగోపాలస్వామి ఆలయాన్ని మంగళవారం రాత్రి ఎంపీ బండి సంజయ్‌కుమార్ సందర్శిం చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు ఎంపీ బండి సంజయ్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గత కొద్ది రోజుల క్రితం ఆలయ పున ర్నిర్మాణానికి ఎండోమెంట్ అధికారులు ఆమోదం తెలుపగా ఆలయం పునర్నిర్మాణానికి విరాళాలు సేకరిస్తున్నారు. ప్రభుత్వం పరంగా రావాల్సిన నిధులకు ఎంపీ చొరవ చూపాలని కమిటీ సభ్యులు కోరగా సానుకూలంగా స్పందించారు.

అర్కండ్ల వాగుపై బ్రిడ్జి నిర్మించాలి

మండలంలోని అర్కండ్ల వాగుపై బ్రిడ్జి నిర్మించాలని ఎంపీ బండి సంజయ్‌కుమార్‌కు గ్రామస్థులు మొర పెట్టుకున్నారు. వీణవంక మండలం నుంచి కేశవపట్నం వేణుగోపాలస్వామి దర్శనానికి వెళ్తున్న బండి సంజయ్ రాకను గమనించి గ్రామస్థులు కాన్వాయ్‌ని ఆపారు. వర్షాకాలంలో నీటి ప్రభావంతో అర్కండ్ల వాగులో ప్రమాదాలు జరుగుతున్నాయని, బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్థులు విన్నవించారు. స్పందించిన ఎంపీ బండి సంజయ్ పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన తర్వాత అర్కండ్ల వాగుపై బ్రిడ్జి నిర్మిస్తానని గ్రామస్థులకు హామీ ఇచ్చారు.

● బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరికలు

గన్నేరువరం: కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై వివిధ పార్టీల నుండి నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరుతున్నట్లు మానకొండూరు అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పార్టీ మండల అధ్యక్షుడు నగునూరి శంకర్ ఆధ్వర్యంలో హన్మాజిపల్లి గ్రామం నుంచి మాజీ ఉపసర్పంచ్ బందెల మల్లేశం, వార్డు సభ్యులు సుంకరి శ్రీనివాస్, పురుషోత్తం, పృథ్వీరాజ్, అమ్మిగల్ల సతీష్, రాజు, రాయమల్లు, బాబు, రాము, అజయ్, పవన్, సంపత్, రాజయ్య, రమేష్‌లు ఎంపీ బండి సంజయ్ సమక్షంలో పార్టీలో చేరారు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, ఏప్రిల్2: అనారోగ్యంతో బాధపడుతున్న కొత్తపల్లి మండలం బద్దిపల్లికి చెందిన గోలి మల్లయ్య(68) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. 20 ఏళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ చికిత్స పొందుతున్నా నయం కానందున జీవితంపై విరక్తి చెంది మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి కొడుకు గోలి శేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, ఏప్రిల్2: మద్యం సేవించి వాహనం నడిపిన ఒక వ్యక్తికి పది రోజుల జైలు శిక్ష, ఇద్దరు వ్యక్తులకు ఐదు రోజుల జైలు శిక్ష, ఒక వ్యక్తికి 3 రోజుల జైలు శిక్ష, జరిమానా ఒక మైనర్‌కు వెయ్యి రూపాయల జరిమానా పడినట్లు కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీంఉల్లాఖాన్ తెలిపారు. కరీంనగర్ పట్టణంలో మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన 17 మంది వాహనదారులను కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్‌ఎదుట హాజరుపరచగా ఒక వ్యక్తికి 10 రోజుల జైలు శిక్ష, ఇద్దరు వ్యక్తులకు 5 రోజుల జైలు శిక్ష, ఒక వ్యక్తికి 3 రోజుల జైలు శిక్ష, మొత్తం 6,500 రూపాయల జరిమానా జడ్జి విధించారని తెలిపారు. మిగతా 12 మందికి 18,500 రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు. ఒక మైనర్ బాలునికి వెయ్యిరూపాయల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, ఏప్రిల్ 2: నగరంలో చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా బుధవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్ ఏడీఈ సాయినేని నరేందర్ తెలిపారు. 11/కెవి శ్రీరామ్‌నగర్ ఫీడర్ పరిధిలో శ్రీరామ్‌నగర్, కొత్తయాష్‌వాడ, ఆదిత్య నగర్, యూనివర్సిటీప్రాంతం, విద్యానగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

గురుకుల కళాశాలలో అవగాహన సదస్సు

కరీంనగర్‌రూరల్, ఏప్రిల్ 2: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల నగునూరులో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సమత ఆధ్వర్యంలో నిర్వహించారు. బర్డ్ వ్యూ ఆన్ ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కన్వీనర్ డి.లలితా అశ్విని, డాక్టర్ బి.రమ, డాక్టర్ నిరూప, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుష్మ, ఆర్.ఇందిరా, ఎం.శారద, నమ్రతా తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్2: స్థానిక 13వ డివిజన్ రాంచంద్రాపూర్ కాలనీ శ్రీఆంజనేయస్వామి దేవాలయం వద్ద బీజేపీ మహిళామోర్చా జిల్లా అధ్యక్షురాలు, కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ ఆధ్వర్యంలో పరిపూర్ణ ఆయుర్వేద హాస్పిటల్ సౌజ న్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. యాంత్రికమైన జీవనశైలిలో ఆరోగ్యమే మహా భాగ్యం కాబట్టి స్థానికు సౌకర్యార్థం ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేని ఆయుర్వేద వైద్య చికిత్స శిబిరాన్ని ఏర్పాటు చేశామని జయశ్రీ తెలిపారు. నడుము నొప్పి, మోకాళ్ళ నొప్పులు, మెడ నొప్పి, కిడ్నీ స్టోన్స్, సయాటికా తదితర వ్యాధులతో బాధపడే వారికి డాక్టర్ హేమలత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇచ్చారని అన్నారు.

అనారోగ్యంతో ఉన్నవారికి

ఎస్సెస్సీ స్పాట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్2: వివిధ అనారోగ్య సమస్యలతో, ఇతర కారణాలతో బాధపడే ఉపాధ్యాయులకు ఎస్సెస్సీ స్పాట్ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని పీఆర్‌టీయు కోరింది. ఈ మేరకు మంగళవారం పీఆర్‌టియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముస్కు తిరుపతిరెడ్డి, మర్రి జైపాల్‌రెడ్డి జిల్లా విద్యాధికారి, స్పాట్ క్యాంపు ఆఫీసర్ సిహెచ్‌విఎస్ జనార్ధన్‌రావును కోరారు.

పనులు పరిశీలించిన మున్సిపల్ చైర్మన్

జమ్మికుంట, ఏప్రిల్ 2: జమ్మికుంట పట్టణంలోని కోరపల్లి రోడ్‌లో గల ఖబ్రస్తాన్‌లో మున్సిపల్ సిబ్బంది మంగళవారం పారిశుధ్య పనులు చేపట్టారు. మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు పనులను పరిశీలించారు.

నవోదయకు ఎంపిక

గన్నేరువరం, ఏప్రిల్ 2, మండల కేంద్రంలోని విజ్ఞాన్ హైస్కూల్ విద్యార్థులు బూర మణిహర్ష, సాంబయపల్లి గ్రామానికి చెందిన గడ్డం ఆరుషిరెడ్డి నవోదయలో సీటు సాధించారు. కరస్పాండెంట్ బూర వెంకటేశ్వర్, ప్రిన్సిపాల్ భానుచైతన్య విద్యార్థులను అభినందించారు.

●గంగాధర : ప్రభుత్వ పాఠశాలలో చదివి ఎలాంటి కోచింగ్ లేకుండా నవోదయలో ఆరవ తరగతికి ఎంపికైన విద్యార్థిని పారునంది అక్షితను ఎంఈవో వేణుకుమార్, మాజీ సర్పంచ్ లక్ష్మీరాజం అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సన్మానం

రామడుగు, ఏప్రిల్ 2 : మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన మోర బద్రేశం ఇంటర్నేషనల్ జిల్లా 320 జి 2024-25 రెండవ ఉప గవర్నర్‌గా గెలుపొందిన సందర్భంగా స్థానిక అంబేద్కర్ యువజన సంఘం నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు.

మానకొండూర్‌లో ఎల్లమ్మ బోనాలు

మానకొండూర్, ఏప్రిల్ 2 : ఎల్లమ్మ బ్రహ్మోత్సవాలలో బాగంగా మానకొండూర్‌లో మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ బోనాలు ఘనంగా జరిగాయి. మానకొండూర్‌తో శ్రీనివాస్‌నగర్, జగ్గయ్యపల్లి, సదాశివపల్లి గ్రామాలలోని మహిళలు బోనాలను ఎత్తుకొని డప్పుచప్పుళ్ళ మధ్య నృత్యాలు చేస్తూ మానకొండూర్‌లోని ఎల్లమ్మ ఆలయానికి చేరుకున్నారు. బోనాలను ఆలయ ప్రాంగణంలో పెట్టి అమ్మ వారికి నైవేద్యం సమర్పించారు. ఆలయ కమిటి సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

'రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి'

హుజూరాబాద్, ఏప్రిల్ 2: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు రైతులు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని బీఆర్ ఎస్వై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల రాజలింగారెడ్డి అన్నారు. మంగళవారం హుజూరాబాద్‌లో ఆయన విలేక రులతో మాట్లాడారు. ఎండిపోయిన పంటల ను పరిశీ లించి వెంటనే ఎకరాకు రూ. 20వేల నుంచి 30వేల వరకు నష్టపరిహారం అందించాలన్నారు. యాసంగి సీజన్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనందున తక్షణమే పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడంతో పాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సమ్మయ్య, సదానందం, రవి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ

మానకొండూర్, ఏప్రిల్ 2 : మండలంలోని పచ్చునూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె. మధుకర్ మంగళవారం పదవీ విరమణ పొందాడు. పాఠశాల ఆవరణలో జరిగిన వీడ్కోల్ సమావేశంలో మధుకర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.